నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, మంగళవారం 24 జూన్ 2025 | WARANGAL

- ఇప్పటికే చాలాసార్లు చెప్పినం
- పీసీసీ చీఫ్‌కు ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యే రేవూరి ఫిర్యాదు
- ఫిర్యాదులపై తేల్చేందుకు త్వరలో కమిటీ ఏర్పాటు
- విచారణ అనంతరం నివేదిక ఆధారంగా చర్యలు

మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలి

వరంగల్, జూన్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంత్రి కొండా సురేఖపై ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నది. కొండా సురేఖ, మురళీధర్‌రావు వివాదాస్పద వ్యవహార శైలి, అనుచిత వ్యాఖ్యలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి నష్టం జరుగుతున్నదని ఎమెల్సీ బస్వరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి సోమవారం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కొండా సురేఖకు వ్యతిరేకంగా ఆదివారం ఇచ్చిన లేఖ కాపీని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు, పీసీసీ చీఫ్‌కు అందజేశారు. సురేఖపై ఇప్పటికే చాలాసార్లు వివరించామని, ఈసారి ఊరుకునే ప్రసక్తే లేదని.. వారి తీరుతో పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ తాము ఇబ్బంది పడుతున్నామని పార్టీ ప్రయోజనాల కోసం ఊరుకుంటున్నామని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా దంపతుల కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అలాగే పరకాల నియోజకవర్గంలో గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని, ఇదిలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుందని ఎమ్మెల్యే రేవూరి వివరించారు. అంతేగాక సొంత పార్టీ నేతలు, కార్యకర్తలపైనే కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేసేలా కొండా దంపతులు వ్యవహరిస్తున్నారని అన్నారు. సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పరిస్థితి దారుణంగా ఉన్నదని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పీసీసీ చీఫ్‌కు చెప్పారు. ప్రభుత్వ వ్యవస్థలపై అతిగా పెత్తనం చెలాయిస్తున్నారని, ఓ మాజీ రౌడీషీటర్‌ను ముందు పెట్టి అనేక దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వివరించారు. తూర్పు నియోజకవర్గంలోని అన్ని పోలీసుస్టేషన్లలోనూ మాజీ రౌడీషీటర్ చెప్పిందే చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఈ వ్యవహారాలు ఉంటున్నాయని చెప్పారు.

కమిటీ నివేదికతో..

కొండా దంపతుల వ్యవహారశైలిపై వరుస ఫిర్యాదుల అంశాన్ని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ తీవ్రంగా పరిగణించారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆధ్వర్యంలో తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రత్యేకంగా ఓ కమిటీ ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించాలని పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ఆదేశించారు. ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని పార్టీ వ్యవహారాలను, కొండా సురేఖపై ఆరోపణలపై విచారణ చేసేలా కమిటీకి బాధ్యత అప్పగించనున్నారు. పలువురు ముఖ్యనేతలో ఓ కమిటీ నియమిస్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కమిటీ ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతల అభిప్రాయాలను తీసుకుని పీసీసీకి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు నివేదిక ఇస్తుందని చెబుతున్నారు.

బల్దియా గ్రీవెన్స్‌లో తోపులాట..

సొమ్మసిల్లి పడిపోయిన ఏఎస్ఐ, సెక్యూరిటీ గార్డుకు స్వల్ప గాయాలు

వరంగల్, జూన్ 23 : సోమవారం వరంగల్ బల్దియా గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువలా వచ్చాయి. వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు ప్రజలు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట అయినా ఇంకా క్యూ అలాగే ఉండడంతో అందరూ ఒకేసారి హాల్‌లోకి తోసుకొని వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డుకు స్వల్ప గాయాలు కాగా, మట్టెవాడ ఏఎస్ఐ సొమ్మసిల్లి పడిపోయారు.

బల్దియా గ్రీవెన్స్‌లో బారులు తీరిన ప్రజలు, (ఇన్‌సెట్) సొమ్మసిల్లి కిందపడిపోయిన ఏఎస్ఐ

ఎంసీహెచ్‌లో పెరుగుతున్న సిజేరియన్లు

జనగామలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో సాధారణ కాన్పుల కంటే కడుపు'కోత' (శస్త్రచికిత్స)లు రోజురోజుకు పెరుగుతున్నాయి. 190 పడకలతో జనగామ, సిద్దిపేట, యాదాద్రి–భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు పెద్దదిక్కుగా ఉన్న ఈ ఆస్పత్రిలో నెలకు 300కు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ఏడాదిన్నరగా సర్కార్ నిర్దేశించిన లక్ష్యం మేరకు సాధారణ కాన్పుల కంటే ఆపరేషన్‌తోనే అధికంగా జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్పించిన అత్యాధునిక వసతులు, ప్రొఫెసర్ స్థాయి గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు సేవలందిస్తున్న ఎంసీహెచ్‌లో రోజుకు సగటున 10 ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాధారణ ప్రసవాలు 60 శాతం, సిజేరియన్ కాన్పులు 40 శాతం జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఆ శాతం తారుమారైంది. గత ఏడాది ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు సాధారణ కాన్పులు 863 జరిగితే సిజేరియన్లు 1,225 జరగడం ఆందోళన కలిగిస్తున్నది. అయితే మొదటి కాన్పుల్లో 90 శాతంకు పైగా సాధారణ ప్రసవాలే ఉంటున్నాయని, గతంలో శస్త్ర చికిత్స చేయడంతో రెండోసారి కూడా సెక్షన్ చేయాల్సి వస్తున్నదని వైద్యులు చెబుతున్నారు.

జనగామ జిల్లా ఆస్పత్రి నుంచి పెరుగుతున్న సిఫార్సులు

ఇక్కడ కాదు.. ఎంజీఎం వెళ్లండి

- రోగులకు స్థానికంగా అందని సర్కారు వైద్యం
- ఓపీ స్థాయి కేసులనూ తరలిస్తున్న వైనం
- పేదలకు శాపంగా దవాఖాన వైద్యుల నిర్వాకం
- ప్రతి అవసరానికి అంబులెన్స్‌ల వినియోగం
- ఎంసీహెచ్‌లో కడుపు'కోత'లే అధికం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వర్ధిల్లిన సర్కారు వైద్యం.. నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నది. స్థానికంగానే అర్హులైన వైద్యులు, అత్యాధునిక యంత్ర పరికరాలున్నా.. సేవల్లో మాత్రం లోపం కనిపిస్తున్నది. చేరువలోనే కార్పొరేట్ వైద్యం అందుతుందని వస్తున్న పేదలకు నిరాశే మిగులుతున్నది. చికిత్స అందించాల్సిన వైద్యులు ఇతర దవాఖానలకు రెఫర్ చేస్తుండడం ఇబ్బందులకు గురిచేస్తున్నది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పేదలు సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తున్నది. ఈ నిర్వాకం జనగామ జిల్లా ఆస్పత్రిలో ప్రతిరోజూ చోటు చేసుకుంటున్నది. చిన్న కేసులను కూడా పెద్దగా చిత్రీకరిస్తూ వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించడం విమర్శలకు దారితీస్తున్నది.

- జనగామ, జూన్ 23 (నమస్తే తెలంగాణ)

జనగామ జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో చంపక్‌హిల్స్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటైంది. దానికి అనుబంధంగా ఉన్న ప్రధాన ఆస్పత్రిని జిల్లా స్థాయికి అప్‌గ్రేడ్ చేసి అర్హత కలిగిన వైద్యులను పెద్ద ఎత్తున నియమించింది. ఇక హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు పోవాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్యం అందుతుందని ఆశపడిన పేదలకు నిరాశే ఎదురవుతున్నది. ఇక్కడ కేవలం ఓపీ స్థాయి కేసులను మాత్రమే చూస్తున్న వైద్యులు.. ఎక్కువ తీవ్రతున్న కేసులు వస్తే క్షణాల్లోనే వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేస్తున్నారు. అయితే అక్కడి డాక్టర్లు వాటిని సాధారణ కేసులుగా పరిగణిస్తూ వైద్యం అందిస్తుండడం విచిత్రం. ఇలా ఎంజీఎంకు రెఫర్ చేస్తున్న కేసుల సంఖ్య గతంలో కంటే ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. పైగా ఇక్కడి నుంచి రోగులను తరలించేందుకు ఆస్పత్రితో పాటు 108 అంబులెన్స్‌లను అధికంగా వినియోగించడం విమర్శలకు దారితీస్తున్నది. జిల్లా ఆస్పత్రికి అన్ని హంగులు సమకూరిన తర్వాత కూడా ఎంజీఎంకు పంపించడం రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. బాధితుడి సమస్య ఆధారంగా క్రిటికల్ కేసులు, అత్యవసర సమయాల్లో మాత్రమే ఎంజీఎంకు రెఫర్ చేయాల్సిన వైద్యులు ఏ మాత్రం రిస్క్ తీసుకోవడం లేదు. ఆస్పత్రి అన్ని విభాగాలకు అర్హతలున్న పీజీ డాక్టర్లను నియమించినప్పటికీ ఈ పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తున్నది. కాగా ఇంట్రాఫెసిలిటీ ట్రాన్స్‌పోర్టేషన్ (ఐఎఫ్‌టీ) కింద 108 వాహనాల వివరాలు ఆరా తీయగా విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. చిన్నా చితక కేసులను సైతం ఎంజీఎంకు డాక్టర్లు సిఫార్సు చేస్తున్న కారణంగా ప్రమాదానికి గురైన వాళ్లు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఒక్కోసారి అవి వరంగల్ నుంచి తిరిగి వచ్చే వరకు బాధితులు వేచి చూడాల్సిన పరిస్థితి దాపురిస్తున్నది.

ఆదర్శం.. ఈ కళాకారుడు

- తన కుమార్తెకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్
- సర్కారు బడుల అభివృద్ధికి రూ. 20 వేలు అందజేత
- పూలతో విద్యార్థినికి స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

పూలతో విద్యార్థినికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 23 : తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచాడు ఈ కళాకారుడు. అంతేకాకుండా సర్కారు బడుల అభివృద్ధికి తెలంగాణ సాంస్కృతిక కళాబృందంలో పనిచేస్తున్న కొలిశెట్టి సత్యనారాయణ రూ.20 వేలు అందజేశాడు. మండ లంలోని కంబాలపల్లి గ్రామంలో సత్యనారాయణ, ఉమారాణి దంపతుల ఏకైక కుమార్తె భవిష్య పటేల్‌కు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. కళాకారుల బృందంతో తన ఇంటి నుంచి డప్పుచప్పుళ్లతో సంబురంగా స్థానిక పాఠశాల టీచర్లు, విద్యార్థులతో కలిసి వచ్చి సర్కారు బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నేడు మెరుగైన విద్య అందుతున్నదని అన్నారు. పదో తరగతి ఫలితాల్లో కంబాలపల్లి ఉన్నత పాఠశాల 100 శాతం ఫలితాలు సాధించిందని, దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు స్కూళ్లలో చేర్పిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు, బుక్స్, నోట్స్, పెన్నులతో పాటుగా పాఠశాల అభివృద్ధికి రూ. 20 వేలు అందించడంపై సత్యనారాయణ కుటుంబసభ్యులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మరికొంతమంది తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమం లో బీసీ సంక్షేమ అధికారి నరసింహారావు, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పూర్ణ చందర్, శ్రీధర్ రెడ్డి, మైస శ్రీనివాసులు, రవి, సువర్ణ, రాధిక, శ్రీజ పాల్గొన్నారు.

ఎంజీఎంలో అమ్మ సేవలు బంద్

- ఇబ్బందులు పడుతున్న బాలింతలు
- పట్టించుకోని వైద్యాధికారులు, ప్రభుత్వం

ఎంజీఎంహెచ్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రం భవనం

వరంగల్ చౌరస్తా, జూన్ 23 : ప్రతి మహిళకు ప్రసవం పునర్జన్మతో సమానం. అలాంటి సమయంలో ఎదురయ్యే అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన వైద్యసేవలు అందుబాటులో ఉంచాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో వైద్య సేవలను నిలిపివేసింది. ఉమ్మడి జిల్లా పరిధే కాక ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా ప్రసూతి వైద్య సేవలం దిస్తున్న ఆస్పత్రుల్లో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు ఎదురయ్యే అసాధారణ సమస్యల సందర్భంగా తల్లీ బిడ్డను ఒకేచోట ఉంచి వైద్యసేవలందించడం ఈ విభాగం ఉద్దేశం. దీనిని పక్కనబెట్టి నవజాత శిశువులకు మాత్రమే పీడియాట్రిక్ విభాగంలో చికిత్స చేస్తూ తల్లికి మాత్రం సేవలు అందించలేకపోతున్నారు. గత ప్రభుత్వం కరోనా సమయంలోనూ ఈ విభాగంలో గైనకాలజీ సేవలందించింది. ప్రస్తుతం ఎందుకు సేవలు కొనసాగించలేకపోతున్నారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జరిగిన వైద్యుల బదిలీల్లో ఎంజీఎంలో గైనకాలజీ విభాగానికి చెందిన వైద్యులను ఇతర ప్రసూతి దవాఖానలకు బదిలీ చేసి, విభాగంలో అందించాల్సిన సేవలకు మంగళం పలికారు. ఎంజీఎంలో సేవలు కొనసాగించకపోవడంపై ఇతర ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్స్ వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మహిళ ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ విభాగంలో అమ్మలకు సైతం వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సింగరాజుపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్‌కు వ్యతిరేక పవనాలు

- అందుకే స్థానిక ఎన్నికలు వాయిదా వేస్తున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, జూన్ 23: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వీస్తున్న వ్యతిరేక పవనాలతోనే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేస్తూ వస్తున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో కార్యకర్తలు, నాయకు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటికే అనేక సర్వేలు చేయించుకోగా ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు తేలిందన్నారు. అందుకే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలంటే సీఎం రేవంత్‌రెడ్డి జంకుతున్నాడని ఎర్రబెల్లి అభిప్రాయపడ్డారు. అతి తక్కువ సమయంలో పాలనలో విఫలమైంది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనని చెప్పారు. అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలిచ్చి, సామాన్యులకు అరచేతిలో స్వర్గం చూపించి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకతతో ప్రజలు ఉన్నారన్నారు. వీటన్నింటినీ కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టికి మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నార ని విమర్శించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ–రేస్ పేర కమిషన్లు వేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు జైలుకు పోతారని తప్పుడు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఎర్రబెల్లి మండిపడ్డారు. అవన్నీ ఉత్తకేసులేనని ఇప్పటికే తేలిపోయిందన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కాక అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, తెలంగాణ ఆదాయం సగానికి సగం తగ్గి రాష్ట్రం దివాలా దిశకు వచ్చిందని స్వయాన సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నదని చెప్పారు. ఇవన్నీ గమనిస్తున్న ప్రజలు స్థానిక సంస్థల ఎన్నిల్లో కర్రుకాల్చి వాతపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, దీంతో అదిగో పులి వచ్చే చందంగా త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలంటూ మంత్రులు ప్రకటనలు చేసి నాలిక కరుచుకుంటున్నారని, పీసీసీ తో చీవాట్లు తింటున్నారని ఎర్రబెల్లి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పక్షాన ఏకపక్షం కానున్నాయని ఎర్రబెల్లి ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి తప్పు చేశామనే భావన ప్రజల్లో ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సమాయత్తమయ్యారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశ్, కొల్లూరు సోమయ్య, కత్తుల సోమిరెడ్డి, చింత రవి, జోగు సోమనర్సయ్య, కే భిక్షపతి, కత్తుల విజయ్‌కుమార్, మేకపోతుల నర్సింహ, వంగ అర్జున్, కోతి ప్రవీణ్, హనుమంతు, కుతాటి నర్సింహులు ఉన్నారు.

రేవంత్ సర్కారుపై ప్రజల్లో అసహనం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

- కాంగ్రెస్ హామీలు, కేసీఆర్ చేసిన అభివృద్ధిపై చర్చ జరగాలి
- ఎన్నిక ఏదైనా ఎగిరేది బీఆర్ఎస్ జెండానే..
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

మొగుళ్లపల్లి, జూన్23 : 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసహనం పెరిగింది. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కాంగ్రెస్ సర్కారు భారీ వ్యతిరేకతను మూటగట్టుకుంది' అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మొగుళ్లపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యేతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ అనుభవం లేని, అసమర్థ చేత గాని పాలన వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని, కేసీఆర్ పాలనలో తమ జీవితాలు అద్భుతంగా ఉన్నాయని వారు పునరాలోచించుకుంటున్నారన్నారు. ఎన్నిక ఏదైనా ఎగిరేది గులాబీ జెండేనన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అక్రమ కేసులకు బయపడేది లేదని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గూడు లేని నిరుపేదకు ఇల్లిస్తే నేడు కాంగ్రెస్ నాయకులు ఇల్లు రాక ముందే లక్షల్లో వసూలు చేస్తున్నారన్నారు. గండ్ర జ్యోతి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. కాగా, గుండ్లకర్తి గ్రామ మాజీ సర్పంచ్ గూడెపు శ్రీనివాస్ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే బంగ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కరాబ్ రజిత భర్త యువరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేశ్, వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్రావు, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ ఉపాధ్యక్షుడు దానవేని రాములు, మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరహరి వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి, కరాబ్ మలహల్ రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఎన్నికల భరోసాగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

- మండలాన్ని అభివృద్ధి చేసింది బీఆర్ఎస్సే..
- 18 నెలల్లో ఏం చేశారో కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పాలి
- కమీషన్ల కోసం కాంట్రాక్టు పనులు అమ్ముకున్నడు
- స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

చెన్నారావుపేట, జూన్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఎన్నికల భరోసాగా మార్చిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం తిమ్మరాయిన్‌పహాడ్ గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు చేసింది బీఆర్ఎస్సే అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే తన సొంత మండలానికి 18 నెలల్లో ఎన్ని నిధులు తీసుకువచ్చాడో, ఏం చేశాడో చెప్పాలన్నారు. మండలంలోని తండాలకు రూ. 9 కోట్లతో ప్రత్యేక బీటీ రోడ్లు మంజూరు చేస్తే ఎమ్మెల్యే వాటిని రద్దు చేశారన్నారు. తాను తెచ్చిన నిధులతోనే ప్రస్తుతం రెండు బీటీ రోడ్ల పనులు చేస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో తాను మంజూరు చేసిన బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం పనులను కమీషన్ల కోసం అమ్ముకున్నారని విమర్శించారు. తాను చేసిన అభివృద్ధిలో ఒక్క శాతం కూడా ప్రస్తుత ఎమ్మెల్యే చేయలేదన్నారు. మండల కేంద్రంలో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, రైతు వేదికలు, పల్లె దవాఖానలు తదితర అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో గ్రామాలు, తండాల్లో జరిగిన అభివృద్ధిని శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల బాధ్యుడు బాల్నె వెంకన్న, మాజీ జడ్పీటీసీ పత్తి నాయక్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, నాయకులు తూటి శ్రీనివాస్, కొండవీటి ప్రదీప్, బోడ బద్దూనాయక్, సారంగం, శ్రీనివాస్, అమీనాబాద్ పీఏసీఎస్ చైర్మన్ మురహరి రవి, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు రఫీ, మాజీ సర్పంచ్‌లు కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, భిక్షపతి, విజేందర్‌రెడ్డి, హంస విజయరామరాజు, ములుక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన జంపయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏటా విద్యుత్ ఉద్యోగుల సంస్మరణ దినోత్సవం

- 16 సర్కిళ్ల పరిధిలో స్మృతి చిహ్నాల ఏర్పాటు
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- హనుమకొండలో స్తూపం ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, జూన్ 23 : ఏటా విద్యుత్ ఉద్యోగుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తామని, ఆ రోజున అమరుల సేవలను కొనియాడుతూ వారి కుటుంబ సభ్యులను సత్కరించి కృతజ్ఞతలు తెలుపుతామని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ విధినిర్వహణలో అసువులు బాసిన ఉద్యోగుల స్మృత్యర్థం హనుమకొండలో ఏర్పాటు చేసిన స్తూపాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే సంకల్పంతో విద్యుత్ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పుతున్న వారి జ్ఞాపకార్థం 16 సర్కిళ్ల పరిధిలో స్మృతి చిహ్నాలు ఏర్పాటు చేస్తున్నామని, ముందుగా హనుమకొండ సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేశామన్నారు.

హనుమకొండలో విద్యుత్ ఉద్యోగుల స్మృతి చిహ్నాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి గ్రాట్యుటీ, వెల్ఫేర్ ఫండ్ తదితర ప్రయోజనాల ఫైల్ ప్రక్రియను ప్రారంభించిన తేదీ నుంచి 45 రోజుల్లోపు పూర్తిచేసి తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఆలస్యం కాకుండా సత్వర చర్యలు చేపట్టి వారి కుటుంబానికి అండగా నిలవాలని సీఎండీ సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బీ అశోక్‌కుమార్, టీ సదర్‌లాల్, టీ మధుసూదన్, వీ తిరుపతిరెడ్డి, సీఈలు కే తిరుమల్‌రావు, రాజుహన్, రవీంద్రనాథ్, హనుమకొండ ఎస్ఈ పీ మధుసూదన్‌రావు, వరంగల్ ఎస్ఈ పీకే గౌతమ్‌రెడ్డి, డీఈలు ఏ విజేందర్‌రెడ్డి, సాంబరెడ్డి, సామ్యానాయక్, దర్శన్‌కుమార్, బేతి భిక్షపతి, ఆనందం, హర్జి, ఎస్ఏ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుకు బారియర్ కష్టాలు